క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం



ఆలయ కమిటీకి నగదు అందజేస్తున్న విఠల్ నాయక్

యాలాల: ఆలయాల అభివృద్ధికి సహాయ సహకారం ఉంటుందని తాండూరు ఏఎంసీ చైర్మన్ విఠల్ నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బాణాపూర్‌లో నిర్మిస్తున్న నర్సప్ప ఆలయానికి తన వంతుగా రూ.2 లక్షల నగదును ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా ఆయన అందజేసి మాట్లాడారు. తాను పుట్టి పెరిగిన బాణాపూర్‌లో అభివృద్ధి కార్యక్రమాలకు తన సహకారం ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా విరాళం ఇచ్చిన విఠల్‌ను సర్పంచ్ బాలిబాయి, ఆలయ కమిటీ సభ్యులు వెంకటయ్య, జములప్ప, భాస్కర్, రాములు తదితరులు అభినందించారు.

అయ్యప్ప దేవాలయానికి..

కొడంగల్: పట్టణ శివారులో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి దౌల్తాబాద్‌కు చెందిన లింగయ్య గౌడ్, తనికెళ్ల అరుణ్‌లు రూ.2లక్షల విరాళం అందజేశారు. గుడి నిర్మాణంలో కీలక భూమిక పోషిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ రవీంద్రయాదవ్‌కు మంగళవారం నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ అయ్యప్ప భక్తులు గుడి నిర్మాణానికి సహకరించాలని కోరారు.

సర్వమత సూక్తుల సారం ఒక్కటే



ఇఫ్తార్ విందులో ముస్లింలు తదితరులు

బంట్వారం: రంజాన్‌ను పురస్కరించుకొని మత్స్య సహకార సంఘం మాజీ అధ్యక్షుడు నక్కల బందెయ్య మంగళవారం కోట్‌పల్లి మసీద్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్వమత సూక్తుల సారం ఒక్కటేనని చెప్పారు. ఇఫ్తార్ కులమతాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు.

మొగిపురుగు నివారణకు చర్యలు

యాలాల: వరి పంటలో మొగిపురుగు నివారణకు రైతులు తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని యాలాల మండల వ్యవసాయ అధికారి యాదగిరి సూచించారు. మంగళవారం వివిధ గ్రామాల్లో ఏఈఓ పర్యటించి పంటలు పరిశీలించి, మొగిపురుగు బెడద ఎక్కువైనట్లుగా గుర్తించారు. అనంతరం వీటి నివారణకు ఏఈఓ పలు సూచనలు చేశారు. కీటక నివారణకు ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు లేదా సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు కార్బ్ ఆఫ్ హైడ్రోక్లోరైడ్ 50శాతం లేదా 70 శాతం మందును, అలాగే క్లోరిన్ట్రో నిలోప్రిల్ 60 మి.లీ. మందును ఎకరాకు 400 గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేయాలని చెప్పారు. ఈ విషయంలో రైతులు నిర్లక్ష్యం చేయకుండా.. వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలని, లేదంటే దిగుబడి తగ్గే ప్రమాదం ఉందన్నారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

కుల్కచర్ల: గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని మండల వైద్యాధికారి వాజుద్దీన్, వైద్యురాలు మాధురిలు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 22మంది లబ్ధిదారులకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భిణులు పోషకాహారం తీసుకోవాలన్న ఉద్దేశంతో.. ప్రభుత్వం పోషక విలువలు గల కిట్లను ఉచితంగా పంపిణీ చేస్తోందని చెప్పారు. పోషకాలు తీసుకోవడం వలన సుఖప్రసవంతో పాటు.. పుట్టిన పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.



వికారాబాద్ అర్బన్: కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్ తదితరులు



తాండూరు టౌన్: పూలే జయంతిలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న తదితరులు

సామాజిక తత్వవేత్తకు సమాజం నివాళి

ఆధిపత్య ధోరణులకు వ్యతిరేకంగా పోరాడిన సామాజిక తత్వవేత్త, మహాత్మాజ్యోతిరావు పూలే అని, ఆయన ఆశయాలు స్ఫూర్తిదాయకం అని వక్తలు అన్నారు. మహాత్మ జయంతి సందర్భంగా మంగళవారం జిల్లాలో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ వర్ణ, లింగ వివక్షకు వ్యతిరేకంగా.. దళిత, గిరిజన, బహుజనుల అభ్యున్నతే ధ్యేయంగా.. రెండు శతాబ్దాల క్రితమే పోరాడిన మహనీయుడు పూలే అని కొనియాడారు.

– సాక్షి, నెట్‌వర్క్



అనంతగిరి: ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కోటిరెడ్డి



పరిగిలో..



తాండూరు టౌన్‌లో..



యాలాలలో..



కుల్కచర్లలో..



కొడంగల్: ఎంపీడీఓ కార్యాలయంలో



తాండూరు రూరల్: చెంగోల్‌లో..



దోమలో ఎంపీడీఓ జయరాం తదితరులు



కొడంగల్ రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



పెద్దేముల్: చైతన్యనగర్‌లో..



మోమిన్‌పేట: ఎన్కేపల్లిలో..



బంట్వారం: ఎంపీడీఓ కార్యాలయంలో



పూడూరు: అంగడిచిట్టంపల్లిలో..



మర్పల్లిలో..

నేడు ఆత్మీయ సమ్మేళనం

కొడంగల్: బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం ఉదయం 10 గంటలకు కొడంగల్‌లో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పట్టణంలోని మురహరి ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి వస్తున్నట్లు పేర్కొన్నారు. బొంరాస్‌పేట మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, టీఆర్‌ఎస్ అభిమానులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

తైబజార్ వేలం

యాలాల: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో మంగళవారం తైబజార్ వేలం నిర్వహించారు. ఏడాది కాలపరిమితికి గాను వేలం వేయగా.. గ్రామానికి చెందిన మహ్మద్ గౌస్ రూ.46,100కు దక్కించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్రాల సులోచన, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి అంజయ్యగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

రేపు కుల్కచర్లలో..

కుల్కచర్ల: తైబజార్ వేలం పాటను గురువారం నిర్వహిస్తామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉదయం వేలం నిర్వహిస్తామని, ఆసక్తిగల వారు పాల్గొనాలని చెప్పారు.

14న పార్టీలకతీతంగా అంబేడ్కర్ జయంతి

తాండూరు టౌన్: ఈనెల 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పార్టీలకు అతీతంగా, అన్ని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తాండూరు జై భీమ్ ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం చెప్పారు. ఈ వేడుకలను బస్టాండ్ నుంచి భీమ్‌జ్ఞాన ర్యాలీ పేరుతో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అంబేడ్కరిస్టులను పార్టీల పేరుతో విడగొట్టి ఉత్సవాలు నిర్వహించాలని చూస్తున్న ఓ రాజకీయ నేత వైఖరిని ఖండిస్తున్నామన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి

బషీరాబాద్: నావంద్గీ రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని పీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్ డిమాండ్ చేశారు. 13 రోజులుగా రైళ్లు నిలపాలని రైల్వే సాధన సమితి సభ్యులు చేపట్టిన నిరసన దీక్షకు మంగళవారం ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. కొన్నేళ్లుగా స్థానికుల డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ మేరకు రైల్వే జీఎంను కలిసి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

మైదానం సరే.. క్రీడా పరికరాలేవి?



ఏన్కతలలో క్రీడా ప్రాంగణం

మోమిన్‌పేట: గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాల్లో పరికరాలు లేవని, సామగ్రి లేని ప్రాంగణాలు ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామానికో తెలంగాణ క్రీడా మైదానాలను ఏర్పాటు చేసి, అందులో పరికరాలు అమర్చింది. అయితే కొన్ని గ్రామాల్లో ఊరుకు దూరంగా ఏర్పాటు చేసినట్లుగా బోర్డు పెట్టి చేతులు దులుపుకొందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండల పరిధి ఏన్కతలలో గ్రామానికి కిలోమీటరు దూరాన 'తెలంగాణ గ్రామీణ క్రీడా మైదానం' అని బోర్డు పెట్టి వదిలేశారు. దీంతో క్రీడా ప్రాంగణంలో పరికరాలు లేకుండా ఎలా కసరత్తు చేయాలని, ఇలా ఉపయోగం లేని విధంగా ఏర్పాటు చేయడం ఎందుకని యువతీయువకులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి క్రీడా పరికరాలు ఏర్పాటు చేయించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలి

మోమిన్‌పేట: వీఓఏల కనీస వేతనం రూ.18 వేలకు పెంచాలని ఆ సంఘం మండల అధ్యక్షురాలు పవిత్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం రాజుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వీఓఏలు గ్రామంలోని డ్వాక్రా సంఘాల పుస్తకాలు రాయడంతో పాటు రుణాలను ఇప్పించడం, వసూలు చేయడం జరుగుతుందని చెప్పారు. ఒక్కో వీఓఏ 40 సంఘాల పుస్తకాలను రాయాల్సి ఉంటుందని, కేవలం నెలకు రూ.3,900ల వేతనం ఇస్తే ఏ విధంగా కుటుంబపోషణ జరుగుతుందని ఆమె ప్రశ్నించారు. ప్రతి వీఓఏకు బీమా సౌకర్యం కల్పించాలని, సీనియార్టీ ఉన్న వీఓఏలకు పదోన్నతి కల్పిస్తూ సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కొరకు సమ్మెకు వెళ్తున్నట్లు ఆమె తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మర్పల్లి: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు పాడైన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు బన్నె మల్లేశ్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో బాధిత రైతులు, పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలతో ఉల్లి, మొక్కజొన్న, జొన్న, కూరగాయ పంటలకు అపార పంటనష్టం జరిగిందన్నారు. వీటిని పరిశీలించేందుకు వచ్చిన మంత్రులు నిరంజన్‌రెడ్డి, సబితారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున అందజేయనున్నట్లు సీఎం కేసీఆర్ గతంలోనే ప్రకటించారని గుర్తుచేశారు. కానీ పంట నష్ట పరిహారం ఇవ్వకుండానే మర్పల్లిలో గురువారం బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారన్నారు. రైతులకు పరిహారం ఇవ్వకుండా ఏర్పాటు చేసే సభలను అడ్డుకుంటామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌గౌడ్, జిల్లా నాయకులు రామేశ్వర్‌రెడ్డి, బలరాంగౌడ్, మండల నాయకులు శ్రీమంత్‌కుమార్, జంగం జైపాల్, పంతులుబాయి శ్రీనివాస్, సీహెచ్ మధుకర్, ప్రవీణ్‌కుమార్, మనోహర్ ఉన్నారు.

ఊట కుంటలతో భూగర్భజలాల పెంపు

దోమ: ఊట కుంటలతో భూగర్భజలాలు పెరగనున్నాయని సర్పంచ్ రాజిరెడ్డి చెప్పారు. మంగళవారం మండల కేంద్రంలో కిష్టయ్య కుంటలో ఉపాధిహామి సిబ్బందితో ఊటకుంటలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఊట కుంటలను ఏర్పాటు చేసుకున్నట్లయితే భూగర్భజలాలు పెరుగుతాయని చెప్పారు. రైతులకు ఉపాధి హామీతో ఉన్నో పనులు జరుగుతున్నాయని, వాటిని వినియోగించుకోవాలన్నారు. అవసరమైన పనులకు రైతులు ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోపాల్ గౌడ్, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

సమాచారం కోసం కాంగ్రెస్ నేతల దరఖాస్తు

బొంరాస్‌పేట: మండలంలోని బీఆర్‌ఎస్ పార్టీ అనుకూల సర్పంచులు నిధుల దుర్వినియోగం, సంబంధిత సర్పంచులపై సరైన విచారణ చేయాలనే పలు రకాల డిమాండ్లతో.. సహచట్టం కింద సమాచారం కొరకు మంగళవారం కాంగ్రెస్ నాయకులు దరఖాస్తు చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ పాండునాయక్‌కు పత్రాన్ని అందజేశారు.

'కంటివెలుగు' దేశానికే వెలుగు

మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప

తాండూరు టౌన్: కంటివెలుగు కార్యక్రమం దేశానికే వెలుగు అని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పట్లోళ్ల దీప అన్నారు. మంగళవారం 9వ వార్డులో రెండో విడత కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించి, కంటి పరీక్ష చేయించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వయసు పెరిగినా కొద్దీ.. కంటి చూపు మందగిస్తుందని, అవగాహన లేక, శ్రద్ధ చూపకపోవడం వలన కొందరు శాశ్వతంగా చూపును కోల్పోతున్నారని చెప్పారు. దీని నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, ఉచితంగా వైద్య పరీక్షలు, కళ్లద్దాలు, మందులు పంపిణీ చేస్తుందని తెలిపారు. కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో వైద్యులు హరీశ్, సారిక, సుధారాణి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్: పెద్ద నందిగామ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరంలో పలువురు కంటి పరీక్ష చేయించుకున్నారు. పరీక్ష అనంతరం అవసరమైన వారికి వైద్యులు మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు సంజీవరెడ్డి, సత్యానారాయణ రెడ్డి, నారాయణరెడ్డి, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణ కోసం..

దోమ: అంధత్వ నివారణ కోసం ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిందని, గ్రామాల్లో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ యశోద సూచించారు. పాలేపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కంటి జబ్బు ఉన్నవారు ఈ శిబిరంలో పరీక్ష చేయించుకోవాలని చెప్పారు. ఎంపీటీసీ విజయ, పంచాయతీ కార్యదర్శి సంతోషి, అంగన్వాడీ టీచర్ మల్లమ్మ, బీఆర్‌ఎస్ నేతలు తిరుపతయ్య సాగర్, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన పది పరీక్షలు



ధారూరు: కేరింతలు కొడుతున్న విద్యార్థినులు



పెద్దేముల్: మంబాపూర్ కేంద్రం వద్ద విద్యార్థినులు

ముసిముసిగా బయటకు వస్తున్న విద్యార్థులు

తాండూరు టౌన్: పలు ఒడిదుడుకుల మధ్య సాగిన పదో తరగతి వార్షిక పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. తాండూరు టౌన్, మండలంతో కలిపి మొత్తం 11 పరీక్ష కేంద్రాల్లో 2,195 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష చివరి రోజున విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా కేరింతలు కొడుతూ కేంద్రాల నుంచి బయటకు వచ్చారు. మిత్రులతో సెల్ఫీలు దిగుతూ హంగామా చేశారు.

ధారూరులో..

ధారూరు: కేరెల్లి, ధారూరు గ్రామాల ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పది పరీక్ష కేంద్రాల్లో మొత్తం 322 మంది విద్యార్థులకు గాను 320 మంది పరీక్ష రాయగా.. ఇద్దరు ఆబ్సెంట్ అయ్యారు. పరీక్ష చివరి రోజు కావడంతో విద్యార్థులు కేంద్రం నుంచి సంతోషంగా బయటకు వచ్చి, కేరింతలు కొట్టారు.

పెద్దేముల్‌లో..

పెద్దేముల్: మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 610 విద్యార్థులకు 607 మంది పరీక్ష రాశారు. మిగతా ముగ్గురు గైర్హాజరయ్యారు. బాలుర ఉన్నత పాఠశాలలో 217, బాలికల ఉన్నత పాఠశాలలో 188, మంబాపూర్ ఉన్నత పాఠశాలలో 205 మందికి ముగ్గురు మొదటి నుంచి రాలేదని ఎంఈఓ వెంకటయ్య తెలిపారు. చివరి రోజు విద్యార్థులు ఉల్లాసంగా పరీక్ష రాసి.. బయటకు వచ్చారు.



కుల్కచర్ల: పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

పక్కదారి పడుతున్న పౌష్టికాహారం!

- అధ్వానంగా అంగన్‌వాడీ నిర్వాహకుల పనితీరు
- మనఊరు–మనబడి ఎంపికలో వివక్ష ఎందుకు?
- సర్వసభ్య సమావేశంలో సభ్యుల మండిపాటు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రభాకర్

బంట్వారం: అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు అధ్వానంగా ఉందని, నిర్వాహకుల నిర్వాకంతో పౌష్టికాహారం పక్కదారి పడుతోందని పలువురు సభ్యులు ఆరోపించారు. ఎంపీపీ ప్రభాకర్ అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో గ్రామాల్లోని సమస్యలను పలువురు సభ్యులు సమావేశంలో అధికారుల దృష్టికి తెచ్చారు. మనఊరు–మనబడిలో పాఠశాలల ఎంపిక విషయంలో మా గ్రామాలపై ఎందుకు వివక్ష చూపారంటూ రొంపల్లి ఎంపీటీసీ సభ్యుడు శ్రీకాంత్‌రెడ్డి, మాలసోమారం సర్పంచ్ నర్సింహారెడ్డి అధికారులను ప్రశ్నించారు. తమ గ్రామాల్లోనూ శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలు ఉన్నాయంటూ అధికారుల తీరుపై మండిపడ్డారు. సుల్తాన్‌పూర్, తొర్మామిడి సర్పంచ్‌లు బర్కత్‌పల్లి నర్సింహులు, స్ఫూర్తి పలు సమస్యలను అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్‌బీ ఏఈ మనోజ్ మాట్లాడుతూ రొంపల్లి, ఓగులాపూర్, తొర్మామిడి, కల్యాడ రోడ్ల మరమ్మతులకు రూ.20 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు.

బాధ్యతగా పని చేయాలి: ఎంపీపీ

బాధ్యతగా పని చేయాలని ఎంపీపీ ప్రభాకర్ అధికారులకు చెప్పారు. సమీక్షలకు శాఖల వారీగా పక్కా నివేదికలతో హాజరు కావాలని, అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సంతోష, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ బాలయ్య, ఎంపీఓ విజయ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ మానస, ఏఈలు సురేష్‌రెడ్డి, వేణుమాధవ్, ఐసీడీఎస్, హెల్త్ సూపర్‌వైజర్లు పార్వతీదేవి, త్రివర్ణ, సీహెచ్ఏ విజయ్ కుమార్, ఏపీఓ సుధాకర్, ఏపీఎం దేవయ్య తదితరులు పాల్గొన్నారు.